


# రిపబ్లిక్ హిందుస్థాన్

తెలుగు దినపత్రిక




సంపుటి-1, సంచిక-1, శనివారం 01-08-2026, ఎడిటర్ :రాథోడ్ రాజు పేజీలు-4, వెల రూ.4/-

Warangal, Ranga Reddy, Khammam, Nizamabad, Karimnagar, Hyderabad, Mahabubnagar, Visakhapatnam, Kadapa, Vijayawada, Tirupati, Guntur, Kurnool, Nellore, Srikakulam

## రూ.4.5 లక్షల కోట్ల ప్రాజెక్టులకు కేంద్ర కేబినెట్ ఆమోదం



ఇంటర్నెట్ డెస్క్: కేంద్ర కేబినెట్ నేడు రూ.4.5 లక్షల కోట్ల విలువైన పథకాలు, ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. ఈ వివరాలను మంత్రి అశ్విని వైష్ణవ్ తాజాగా వెల్లడించారు. మొత్తం 4,50,988 కోట్ల రూపాయల కేటాయింపునకు కేబినెట్ ఆమోదం తెలిపిందని అన్నారు. ప్రధానమంత్రి సూర్య సరోవర్ యోజనకు 5,070 కోట్ల రూపాయలు కేటాయించామని చెప్పారు. ఇప్పటికే తలసరి సౌర విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంలో భారత్ మొదటి స్థానంలో ఉందని మంత్రి అన్నారు. ఈ పథకం కింద డ్యామ్‌లు, సరస్సులపై ఫ్లోటింగ్ సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసి 5000 మెగా వాట్స్ విద్యుత్ ఉత్పత్తి చేసేలా లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామని అన్నారు. రాబోయే ఐదేళ్లల్లో ఫ్లోటింగ్ సోలార్ ప్యానెల్ విద్యుత్ ఉత్పత్తిని 7 రెట్లు పెంచుతామని చెప్పారు

## భారత్‌కు జిన్‌పింగ్ రాక?.. బ్రిక్స్ సదస్సుకు హాజరయ్యే అవకాశం!



ఇంటర్నెట్ డెస్క్: చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ ఈ ఏడాది సెప్టెంబర్‌లో భారత్‌ను సందర్శించే అవకాశమున్నట్లు దౌత్య వర్గాలు తెలిపాయి. ఢిల్లీలో సెప్టెంబర్ 12, 13 తేదీల్లో జరగనున్న బ్రిక్స్(దీ=×జూ) శిఖరాగ్ర సదస్సుకు ఆయన హాజరయ్యే ఛాన్స్ ఉన్నట్టు తెలుస్తోంది. ఈ పర్యటన ఖరారైతే.. 2020లో గల్వాన్ లోయలో భారత్-చైనా సైన్యాల మధ్య జరిగిన ఘర్షణ అనంతరం జిన్‌పింగ్ భారత్‌కు రావడమిదే తొలిసారి కానుంది. జిన్‌పింగ్ చివరిసారిగా 2019 అక్టోబర్‌లో భారత్‌లో పర్యటించారు. ఆ తర్వాత తూర్పు లద్దాఖ్‌లోని వాస్తవాధీన రేఖ(రాూజ) వెంబడి నెలకొన్న ఉద్రిక్తతలు, గల్వాన్ ఘర్షణలతో ఇరు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో సరిహద్దు సమస్యల పరిష్కారం కోసం సైనిక, దౌత్య స్థాయిలో పలు దఫాలుగా చర్చలు కొనసాగుతున్నాయి. చైనా అధ్యక్షుడి పర్యటనకు ముందు ఇరు దేశాల మధ్య దౌత్య చర్చలు మరింత వేగం పుంజుకునే అవకాశం ఉందని సమాచారం. ఈ మేరకు జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోబాల్ త్వరలో చైనాలో పర్యటించే అవకాశాలూ కనిపిస్తున్నాయి. అలాగే భారత్-చైనా సరిహద్దు వ్యవహారాలపై వర్కింగ్ మెకానిజం ఫర్ కన్సల్టేషన్ అండ్ కోఆర్డినేషన్(ఔవీజజ) సమావేశం కూడా జరగనున్నట్లు విశ్వసనీయ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ మేరకు సరిహద్దు వివాదంపై ప్రత్యేక ప్రతినిధుల మధ్య త్వరలో సమావేశం నిర్వహించే అవకాశముంది. సరిహద్దు సమస్యల పరిష్కారానికి కొత్త నిపుణుల బృందం, వర్కింగ్ గ్రూప్‌ను ఏర్పాటుచేయాలని ఇటీవల ఇరు దేశాలు అంగీకరించిన నేపథ్యంలో ఈ సమావేశం ప్రాధాన్యం సంతరిచుకుంది. జిన్‌పింగ్ భారత పర్యటన ఖరారైతే.. బ్రిక్స్ సదస్సు సందర్భంగా భారత్, చైనా నాయకుల మధ్య ద్వైపాక్షిక సమావేశం జరిగే అవకాశముంది. సరిహద్దు వివాదం, ప్రాంతీయ భద్రత, ద్వైపాక్షిక వాణిజ్యం, ఆర్థిక సహకారం వంటి కీలకాంశాలు చర్చకు రావచ్చు. అయితే.. జిన్‌పింగ్ భారత పర్యటనపై ఇప్పటివరకు ఇటు ఢిల్లీ గానీ, అటు బీజింగ్ గానీ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటనా విడుదల చేయలేదు.

## కావేరీ జలాల వివాదం.....

### తమిళనాడు సర్కార్‌తో చర్చల్లేవ్: డీకే శివకుమార్



బెంగళూరు ,(రిపబ్లిక్ హిందుస్థాన్):కర్ణాటక-తమిళనాడు మధ్య కావేరీ జలాల వివాదంపై కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మరోసారి స్పందించారు. తమిళనాడు సర్కార్‌తో చర్చల్లేవని తేల్చి చెప్పారు. తమిళనాడుకు 15 రోజుల పాటు కావేరీ జలాలను విడుదల చేయాలంటూ కావేరీ వాటర్ మేనేజ్‌మెంట్ అథారిటీ (సీడబ్ల్యూఎమ్ఏ) కర్ణాటకకు ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో.. రాష్ట్రంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ప్రో కన్నడ గ్రూపులు ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు మొదలెట్టాయి. విపక్షాలు ఆగస్టు 13వ తేదీన రాష్ట్ర వ్యాప్త బంద్‌కు పిలుపునిచ్చాయి. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి డీకే శివకుమార్ శుక్రవారం మధ్యాహ్నం విధాన సౌధలో మంత్రులు, అధికారులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. సీడబ్ల్యూఎమ్ఏ ఆదేశాలపై ప్రభుత్వం చట్టపరంగా ఎలా ముందుకు వెళ్లాలనే అంశంపై సమీక్షా సమావేశంలో ప్రధానంగా చర్చించారు. సమావేశం అనంతరం ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మీడియాతో మాట్లాడుతూ.. తమిళనాడు ప్రభుత్వంతో నేరుగా చర్చలు జరిపేందుకు ప్రస్తుతానికి సానుకూల వాతావరణం లేదని తేల్చి చెప్పారు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడేందుకు ఈ వివాదంపై చర్చించేందుకు ఆగస్టు మొదటి వారంలో ఆల్ పార్టీ మీటింగ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. విపక్షాలు, రైతు సంఘాలతో పూర్తిగా చర్చించిన తర్వాతే నీటి విడుదలపై తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. విపక్షాలు బంద్ నిర్ణయాన్ని విరమించుకోవాలని సీఎం కోరారు.

# 1.36 లక్షల ఓట్ల తొలగింపు

## 13.40 లక్షల నుంచి 12.04 లక్షలకు తగ్గిన ఓటర్ల సంఖ్య



చిత్తూరు,(రిపబ్లిక్ హిందుస్థాన్): ప్రత్యేక ఓటర్ల సమగ్ర సవరణ (సర్) ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో జిల్లాకు సంబంధించిన ముసాయిదా ఓటర్ల జాబితాను శుక్రవారం ఎన్నికల సంఘం విడుదల చేసింది. ఈ ఏడాది జూన్ 1న ప్రచురించిన తుది ఓటర్ల జాబితాలో ఉన్న 13,40,126 మంది ఓటర్లలో 1,36,059 మంది పేర్లను తొలగించారు. ప్రస్తుత ముసాయిదా జాబితాలో 12,04,067 మంది ఓటర్లు మాత్రమే ఉన్నారు. దీంతో జిల్లాలో దాదాపు పది శాతం ఓటర్లు జాబితా నుంచి తొలగింపునకు గురైనట్లు స్పష్టమైంది.

జూన్ 1న విడుదలైన జాబితాలో జిల్లాలో మొత్తం 13,40,126 మంది ఓటర్లు ఉండగా, వారిలో పురుషులు 6,58,823 మంది, మహిళలు 6,81,236 మంది, థర్డ్ జెండర్‌కు చెందిన 67 మంది ఉన్నారు. అనంతరం చేపట్టిన ప్రత్యేక సమగ్ర పరిశీలనలో మరణించినవారు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లినవారు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల పేరున్నవారు, గుర్తించలేని ఓటర్ల పేర్లను తొలగిస్తూ అధికారులు ముసాయిదా జాబితాను సిద్ధం చేశారు.

పలమనేరులోనే అత్యధిక తొలగింపులు

జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పరిశీలిస్తే పలమనేరు నియోజకవర్గంలోనే అత్యధికంగా 29,381 మంది ఓటర్ల పేర్లు తొలగించారు. ఆ తర్వాత చిత్తూరులో 26436 మంది, కుప్పంలో 24418 మంది, నగరిలో 20879 మంది, పూతలపట్టులో 20321 మందిను ఓటర్ల జాబితా నుంచి తొలగించారు. జీడీనెల్లూరులో నియోజకవర్గంలో మాత్రం అత్యల్పంగా 14624 మంది పేర్లే తొలగించారు.

ముసాయిదా జాబితాలో నియోజకవర్గాల వారీగా ఓటర్లు

పలమనేరు 2,42,945,కుప్పం 2,06,056, పూతలపట్టు 202434జీడీనెల్లూరు 192718, నగరి 182814,చిత్తూరు 177100

జాబితాపై రాజకీయ పార్టీల దృష్టి

జిల్లాలో 1.36 లక్షల ఓట్లు తొలగింపునకు గురి కావడంతో రాజకీయంగా చర్చనీయాంశమైంది. కూటమిలోని మూడు పార్టీలతో పాటు వైసీపీ కూడా తొలగించిన ఓటర్ల వివరాలను బూత్ స్థాయిలో పరిశీలించాల్సిన అవసరం ఉంది. అర్హుల పేర్లు తొలగించి ఉంటే వాటిని తిరిగి చేర్చేందుకు ఆయా పార్టీల ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉంది.

అభ్యంతరాల అనంతరం తుది జాబితా

ముసాయిదా జాబితాపై అర్హులైన ఓటర్లు, రాజకీయ పార్టీలు క్లెయిమ్‌లు, అభ్యంతరాలు అందించవచ్చు. నిజమైన ఓటర్లు ఫారం-6తో మళ్లీ నమోదు చేసుకునే అవకాశముంది. జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు అభ్యంతరాలను స్వీకరించి, అక్టోబరు 3న తుది ఓటరు జాబితా ప్రకటించనున్నారు. నోటీసు, విచారణ లేకుండా ఏ ఓటరు పేరునూ తొలగించమని అధికారులు స్పష్టత ఇస్తున్నారు.

2

## మానవ అక్రమ రవాణా ఉచ్చులో ప్రపంచం?..

### స్వేచ్ఛను కబళిస్తున్న అక్రమ రవాణా...ప్రాణాలతో వ్యాపారం చేస్తున్న ముఠాలు



డెస్క్ ,(రిపబ్లిక్ హిందుస్థాన్):ప్రపంచవ్యాప్తంగా వేగంగా విస్తరిస్తున్న మానవ అక్రమ రవాణా ఇప్పుడు కొత్త రూపం దాల్చింది. ఉద్యోగాలు, విదేశీ ఉపాధి, అధిక వేతనాల పేరుతో యువతను మోసగించి ఆన్‌లైన్ మోస కేంద్రాల్లో బలవంతంగా పనిచేయిస్తున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో జూలై 30న నిర్వహించే మానవ అక్రమ రవాణా వ్యతిరేక ప్రపంచ దినోత్సవానికి ఈ ఏడాది “ఆన్‌లైన్ మోసాల వెనుక చిక్కుకున్న జీవితాలు” అనే అంశాన్ని ప్రధాన సందేశంగా ఐక్యరాజ్యసమితి ప్రకటించింది. మోసపూరిత ఉద్యోగ ప్రకటనల ద్వారా వేలాది మంది అంతర్జాతీయ నేర ముఠాల బారిన పడుతున్నారని హెచ్చరించింది. ప్రపంచంలోని అనేక దేశాల్లో యువతకు అధిక జీతాలు, సాంకేతిక ఉద్యోగాలు, విదేశీ అవకాశాలు కల్పిస్తామని చెప్పి తీసుకెళ్లిన తర్వాత వారిని నిర్బంధించి ఆన్‌లైన్ మోసాలకు పాల్పడేలా బలవంతం చేస్తున్నట్లు ఐక్యరాజ్యసమితి వెల్లడించింది. నిరాకరిస్తే శారీరక హింస, బెదిరింపులు, నిర్బంధం వంటి అమానుష చర్యలకు పాల్పడుతున్నారని పేర్కొంది. ఈ నేరాల వెనుక అంతర్జాతీయ వ్యవస్థీకృత నేర ముఠాలు, సైబర్ నేరాలు, నల్లధన చలామణి పరస్పరం అనుసంధానమై ఉన్నాయని వెల్లడించింది. మానవ అక్రమ రవాణా ఇప్పుడు కేవలం లైంగిక దోపిడీ లేదా బలవంతపు శ్రమకే పరిమితం కావడం లేదు. డిజిటల్ యుగంలో నేరగాళ్లు సామాజిక మాధ్యమాలు, నకిలీ ఉద్యోగ వెబ్‌సైట్లు, సందేశాల వేదికలు, తప్పుడు నియామక సంస్థలను వినియోగించి బాధితులను వలలో వేసుకుంటున్నారు. ఉద్యోగం

2

## ప్రయాణికులు ఫుల్.. వసతులు నిల్

- మెట్రో సేవలపై నగరవాసుల అసంతృప్తి
- టేకోవర్ అనంతరం వసతుల కల్పనలో ప్రభుత్వం విఫలం
- సమీక్షలకే పరిమితమవుతున్న ఆ ముగ్గురు అధికారులు
- సోషల్ మీడియా వేదికగా మండిపడుతున్న నెటిజన్‌లు



తెలంగాణ,(రిపబ్లిక్ హిందుస్థాన్): నగరంలో రద్దీ వేళల్లో మెట్రో రైళ్లలో ప్రయాణించడం నరకప్రాయంగా మారింది. పీక్ అవర్స్‌లో బోగీల సంఖ్య, రైళ్ల ఫ్రీక్వెన్సీ పెంచకపోవడంపై ప్రయాణికులు తోపులాట మధ్యనే ప్రయాణించాల్సి వస్తోంది. పలు స్టేషన్లలో లిఫ్టులు, ఎస్కలేటర్లు కనీసం మరమ్మతులు కూడా నోచుకోవడంలేదు. ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులు మెట్రో స్టేషన్లకు వెళ్లాలంటే వీల్‌చైర్లు, హెల్పింగ్ సిబ్బంది లేక అవస్థలు పడుతున్నారు. ఇక పార్కింగ్ తిప్పలు మెట్రో ప్రయాణికులకు అనివార్యం కాగా, టికెట్ కౌంటర్ల భారీ క్యూలైన్లు నిత్యకృత్యమవుతున్నాయి. గడిచిన రెండేళ్లలో మెట్రో నిర్వహణ అధ్వాన్నంగా మారింది. ముఖ్యంగా మెట్రోను గతేడాది బ్రేక్‌డౌన్ సమస్యలు చుట్టుముట్టాయి. బ్రేక్‌డౌన్ కారణంగా

## 33 శాతం కోటాను తక్షణమే అమలు చేయాలి

న్యూఢిల్లీ బ్యూరోపార్లమెంటు, రాష్ట్ర శాసనసభలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను తక్షణమే అమలు చేయాలని మహిళా సంఘాలు డిమాండ్ చేశాయి. 'నేషనల్ కోయిలిషన్ ఫర్ ఉమెన్స్ రిజర్వేషన్స (ఎన్‌సీడబ్ల్యూఆర్) ఆధ్వర్యంలో జంతర్ మంతర్ వద్ద చేపట్టిన ఐక్య ఆందోళన శుక్రవారం నాటికి పదో రోజుకు చేరుకుంది. ఢిల్లీలోని వివిధ ప్రాంతాల నుంచి వందలాది మంది మహిళలు, అలాగే కేరళ నుంచి వచ్చిన భారీ ప్రతినిధి బృందం రంగురంగుల బ్యానర్లు, ప్లకార్డులు, పోస్టర్లు, జెండాలతో ఆందోళనలో పాల్గొన్నారు.

బీజేపీది మనువాద కుట్ర : జాన్ బ్రిట్టాస్

మహిళల రాజకీయ హక్కుల కోసం నిలకడగా పోరాడుతున్న వామపక్ష పార్టీల తరపున మద్దతు, సంఘీభావం తెలిపేందుకు రాజ్యసభ సీపీఐ(ఎం) పక్షనేత జాన్ బ్రిట్టాస్ ఆందోళన ప్రదేశాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా రిజర్వేషన్ చట్టం అమలును ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తున్న బీజేపీ ప్రభుత్వ చర్యలను ఆయన 'మనువాద కుట్ర'గా అభివర్ణించారు. పోరాటంతో తమ హక్కులను ఎలా సాధించుకోవాలో దేశంలో మహిళలకు తెలుసునని, ప్రభుత్వాన్ని బాధ్యత నుంచి తప్పించుకోనివ్వరని ఆయన అన్నారు. బీజేపీ ద్వంద్వ వైఖరి ప్రజల ముందు బట్టబయలు అవుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ నిరసన సభలో పలు మహిళా సంఘాల ప్రతినిధులు ప్రసంగించారు. వీరిలో ఐద్వా జాయింట్ సెక్రెటరీ, ఢిల్లీ రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షురాలు ఆశా శర్మ, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జాతీయ నాయకురాలు మైమూనా మొల్లా, మణిపూర్ నుంచి అరుణ, రహీనా బేగం రాజ్, వైడబ్ల్యూసీఏ నుంచి ప్రజ్ఞ, ఏఐపీడబ్ల్యూఏ నుంచి పూజ తదితరులు ఉన్నారు. మహిళా రిజర్వేషన్ చట్టాన్ని అమలు చేయడానికి మోడీ ప్రభుత్వం నిరంతరం నిరాకరిస్తుండటంపై వక్తలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## మహంకాళి బోనాలకు ట్రాఫిక్ ఆంక్షలు



సికింద్రాబాద్,(రిపబ్లిక్ హిందుస్థాన్): సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహంకాళి బోనాల జాతర సందర్భంగా భక్తుల రద్దీ నేపథ్యంలో ఈనెల 2నుంచి 4వ తేదీ వరకు ఆలయం చుట్టూ రెండుకిలోమీటర్ల పరిధిలో ట్రాఫిక్ మళ్లింపులు, ఆంక్షలు అమలు చేస్తున్నామని ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ జోయల్ డేవిస్ తెలిపారు. జాతర సందర్భంగా 1వ తేదీ అర్ధరాత్రి ఒంటిగంటల నుంచి 4వ తేదీ ఉదయం వరకు పొగాకుబజార్, హమాలీ విగ్రహం నుంచి మహంకాళి ఆలయానికి వెళ్లే రహదారులు, సుభాష్‌రోడ్ , హిల్ స్ట్రీట్, అడవియ్య క్రాస్‌రోడ్స్ నుంచి మహంకాళి ఆలయానికి వెళ్లే దారి, జనరల్‌బజార్ నుంచి మహంకాళి ఆలయానికి వెళ్లే దారిని మూసివేస్తామని చెప్పారు. ముఖ్యంగా కర్బాలాక్రాస్రోడ్స్ వద్ద చిల్డ్రన్‌పార్క్ నుంచి వచ్చే వాహనాలను రాణిగంజ్‌వైపు మళ్లిస్తారు. రాణిగంజ్‌క్రాస్‌రోడ్స్ సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ వైపు కర్బాలా మైదాన్ నుంచి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులు,సాధారణ వాహనాలు రాణిగంజ్ క్రాస్‌రోడ్స్ వద్ద మినిస్టర్ రోడ్డు , గోపాలపురం లైన్ మీదుగా రైల్వేస్టేషన్‌కు వెళ్లాలి

## వచ్చే నెలలో లోటు వర్షపాతమే.. భారత వాతావరణ శాఖ అంచనా

ఇంటర్నెట్ డెస్క్: దేశంలో జులై నెలలో దాదాపు సాధారణ స్థాయిలో వర్షపాతం నమోదు కావడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఎల్‌నినో కారణంగా జూన్‌లో ముఖం చాటేసిన వానలు అనూహ్యంగా జులైలో పుంజుకున్నాయి. అయితే, వచ్చే నెలలో మాత్రం లోటు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది.ఆగస్టు నెల సగటు వర్షపాతం (లాంగ్ పీరియడ్ యావరేజ్) 254.9 మిల్లీమీటర్లు. అయితే, ఇందులో 94 శాతం వరకూ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. సెప్టెంబర్ నెలలో కూడా దాదాపు ఇవే పరిస్థితులు కొనసాగే అవకాశం ఉందని నిపుణుల అంచనా. ఫలితంగా ఈ సీజన్ ద్వితీయార్థంలో దీర్ఘకాలిక సగటుకు 94 శాతం లోపే వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని ఐఎమ్ఎఫ్ అంచనా వేసింది. జాతీయ స్థాయిలో వర్షాభావం కనిపించినప్పటికీ కొన్ని ప్రాంతాల్లో మాత్రం వర్షాలు సాధారణ స్థాయిలో ఉండే అవకాశం ఉంది. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలు, మధ్య భారత దేశం, ఈశాన్య రాష్ట్రాల్లో వర్షపాతం సాధారణ స్థాయి వరకూ ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ భావిస్తోంది.



మొదటిపేజీ తరువాయి

## మానవ అక్రమ రవాణా ఉచ్చులో ప్రపంచం?..

కోసం దరఖాస్తు చేసిన అభ్యర్థుల వ్యక్తిగత వివరాలను సేకరించి వారిని విదేశాలకు రప్పించి, అక్కడ అక్రమ మోస కేంద్రాల్లో బంధించి సైబర్ మోసాలకు ఉపయోగిస్తున్న ఘటనలు పెరుగుతున్నాయి. ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ కూడా ఈ ఏడాది సందేశంలో బలవంతపు ఆన్‌లైన్ మోస కేంద్రాలు మానవ అక్రమ రవాణాలో అత్యంత వేగంగా పెరుగుతున్న రూపంగా మారాయని హెచ్చరించారు. కృత్రిమ మేధస్సు వంటి ఆధునిక సాంకేతికతలను కూడా నేరగాళ్లు తమ కార్యకలాపాలకు వినియోగిస్తున్నారని, ఈ పరిస్థితిని ఎదుర్కోవాలంటే ప్రపంచ దేశాలు సమాచార భాగస్వామ్యం, చట్ట అమలు సంస్థల సమన్వయం, ఆర్థిక నేరాల నియంత్రణలో మరింత బలంగా పనిచేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.

భారత్‌లో కూడా ఉద్యోగాల పేరుతో విదేశాలకు వెళ్లే యువత అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. ప్రభుత్వ అనుమతి పొందిన నియామక సంస్థల ద్వారానే విదేశీ ఉద్యోగాలకు వెళ్లడం, ఒప్పంద పత్రాలను పూర్తిగా పరిశీలించడం, కుటుంబ సభ్యులకు పూర్తి సమాచారం అందించడం, గుర్తింపు లేని వ్యక్తులు లేదా సంస్థల ఆఫర్లను నమ్మకపోవడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. సైబర్ నేరాలు, మానవ



అక్రమ రవాణా మధ్య సంబంధం పెరుగుతున్న నేపథ్యంలో డిజిటల్ అవగాహన కూడా అత్యంత అవసరమని చెబుతున్నారు. మానవ అక్రమ రవాణా అనేది మానవ హక్కులపై జరిగే అత్యంత దారుణమైన దాడుల్లో ఒకటి. దీన్ని అరికట్టేందుకు ప్రభుత్వాలు, దర్యాప్తు సంస్థలు, న్యాయవ్యవస్థ, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు సమిష్టిగా పనిచేయాల్సిన అవసరం ఉంది. అనుమానాస్పద నియామకాలు, అక్రమ తరలింపులు, మోసపూరిత ఉద్యోగ ప్రకటనలపై వెంటనే అధికారులకు సమాచారం అందించడం ద్వారా అనేక మంది ప్రాణాలను కాపాడవచ్చు. మానవ అక్రమ రవాణా వ్యతిరేక ప్రపంచ దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి, మానవ గౌరవాన్ని కాపాడే సమాజ నిర్మాణానికి తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిస్తోంది.

మొదటిపేజీ తరువాయి

## ప్రయాణికులు ఫుల్.. వసతులు నిల్

మెట్రో ఎప్పుడు ఆగిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. టికెట్ల ధరలను పెంచడంపై ఉన్న ఆసక్తి... సౌకర్యాల విషయంలో ఎందుకు లేదని మెట్రో ప్రయాణికులు సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. రద్దీ ఎక్కువ ఉండే సమయాలోనైనా ఎలాంటి నియంత్రణ చర్యలను తీసుకోవడంపై ఇప్పటివరకు మెట్రో నిర్వహణ సంస్థ దృష్టి పెట్టలేదనే విమర్శలు ఉన్నాయి. ఏళ్లు గడుస్తున్నా.. మెట్రో సేవల్లో ఎలాంటి పురోగతి కనిపించలేదని, అదనపు బోగీలు ఇప్పుడు వచ్చే పరిస్థితి లేకపోవడంతో.. మెట్రో ప్రయాణమే కష్టతరంగా మారిందని విమర్శస్తున్నారు.మెట్రో సంస్థ నిర్వహణ ముగ్గురు అధికారుల పర్యవేక్షణలో సాగుతున్నా.. మెట్రోలో ప్రయాణికులకు ఎలాంటి మెరుగైన సేవలు అందడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇక అధికారులు చేసే సమీక్షలు కూడా ప్రతిపాదనలకే పరిమితం చేయకుండా కార్యరూపంలోకి తీసుకురావాలన్నారు. రైళ్ల ఫ్రీక్వెన్సీ పెంచడం, మౌలిక వసతులను కల్పించడం, మహిళా ప్రయాణికులకు భద్రత విషయంలో పకడ్బందీ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రయాణికులు కోరుతున్నారు.



## భారీ వర్షాల వల్ల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి

### రైతులు పంటల సాగులో సమతుల్యత పాటించాలి - రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి

నిర్మల,(రిపబ్లిక్ హిందుస్థాన్): ఇటీవల కురిసిన భారీ వర్షాలు, ప్రాజెక్టుల పరిస్థితి, పంటల సాగు, ఎల్‌నినో ప్రభావం తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.జిల్లాల్లో భారీ వర్షాల వలన ప్రాజెక్టుల నీటి నిల్వలు, ఇన్‌ఫ్లో--ఔట్‌ఫ్లో పరిస్థితులు, దెబ్బతిన్న రహదారులు, వంతెనల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు మాట్లాడుతూ, రహదారులు, వంతెనలు దెబ్బతిన్నట్లయితే వెంటనే మరమ్మతులు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని సూచించారు. ప్రాజెక్టులకు వస్తున్న ఇన్‌ఫ్లోను దృష్టిలో ఉంచుకుని అవసరమైన మేరకు గేట్లు ఎత్తి నీటిని విడుదల చేయాలని తెలిపారు.ఎల్‌నినో ప్రభావం వల్ల రానున్న రోజుల్లో వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున రైతులకు పంట మార్పిడి విధానాలపై వ్యవసాయ శాఖ అధికారులు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. అధిక నీటి అవసరమున్న వరి పంటకు బదులుగా ఆయిల్‌పామ్, కంది, నువ్వులు, పత్తి తదితర ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని తెలిపారు. కొత్త పంటల సాగుకు అవసరమైన విత్తనాల సరఫరాకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని పేర్కొంటూ రైతులు పంటల సాగులో సమతుల్యత పాటించాలని సూచించారు.సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) డెలివరీ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా మాట్లాడుతూ, గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలతో జిల్లాలోని ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు నిండాయని తెలిపారు. భారీ వర్షాలతో దెబ్బతిన్న రహదారుల మరమ్మతు పనులు వేగంగా చేపడుతూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రానున్న రోజుల్లో ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఎదురైనా ప్రస్తుతం కురిసిన వర్షాల కారణంగా తాగునీటి సమస్య ఉండదని పేర్కొన్నారు. రైతులు పంట మార్పిడి విధానాలు పాటించేలా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు విస్తరిస్తోందని వెల్లడించారు.ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ, గతంలో జిల్లాలో 38 శాతం వర్షపాతం లోటు ఉండగా ప్రస్తుతం అది 6 శాతానికి తగ్గిందని తెలిపారు. జిల్లాలోని 21 మండలాల్లో 17 మండలాలు సాధారణ వర్షపాతం స్థితికి చేరుకున్నాయని పేర్కొన్నారు. గతంలో నీటి ఎద్దడి మండలాలుగా ఉన్న ఇంద్రవెల్లి, భోరజ్, సిరికొండ, బోథ్, గుడిహత్నూర్, ఇచ్చోడ మండలాలు ప్రస్తుతం సాధారణ పరిస్థితికి చేరుకున్నాయని వివరించారు.ఈ ఏడాది జిల్లాలో 5,93,670 ఎకరాల్లో పంటల సాగు నమోదైందని, అందులో 4,37,698 ఎకరాల్లో పత్తి సాగు జరిగిందన్నారు. గత ఏడాదితో పోలిస్తే కంది సాగు 44 వేల ఎకరాల నుంచి 56,751 ఎకరాలకు పెరిగిందని తెలిపారు. సాత్నాల, మత్తడి వాగు ప్రాజెక్టుల్లో ప్రస్తుతం ఉన్న నీటి నిల్వలు వ్యవసాయంతో పాటు తాగునీటి అవసరాలకు ఎంతో ఉపయోగపడనున్నాయని పేర్కొన్నారు.ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ జానకి షర్మిల, నిర్మల్, ఆదిలాబాద్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, ఎస్. రాజేశ్వర్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, డీఆర్వో రాథోడ్ రమేష్, డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# తక్కువ ధరకే నాణ్యమైన బియ్యం... ఆగస్టు ఒకటి నుంచి విక్రయాలు
## ప్రజలకు ఊరటనిచ్చిన నిర్ణయం... రైతుబజార్లలో ప్రత్యేక కౌంటర్లు

అమరావతి,(రిపబ్లిక్ హిందుస్థాన్):ఆంధ్రప్రదేశ్ ప్రజలకు తక్కువ ధరకే నాణ్యమైన బియ్యాన్ని అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆగస్టు 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఈ బియ్యం విక్రయాలు ప్రారంభం కానున్నాయి. బహిరంగ మార్కెట్లో బియ్యం ధరలు పెరుగుతున్న నేపథ్యంలో సామాన్యులకు ఊరట కల్పించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తెలిపారు. ధరల నియంత్రణతో పాటు ప్రజలపై ఆర్థిక భారం తగ్గించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరల ప్రభావం నుంచి ప్రజలను రక్షించేందుకు కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో భాగంగానే ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు వివరించారు. ప్రతి కుటుంబానికి నాణ్యమైన బియ్యం అందుబాటు ధరలో లభించేలా చర్యలు చేపట్టామని చెప్పారు.ఈ కార్యక్రమం అమలులో పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రత్యేక చొరవ తీసుకున్నట్లు పవన్ కళ్యాణ్ వెల్లడించారు. ప్రభుత్వ యంత్రాంగం, బియ్యం మిల్లర్లతో పలుమార్లు సమావేశాలు నిర్వహించి, ప్రజలకు తక్కువ ధరకే నాణ్యమైన బియ్యం అందించే విధంగా కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని 130 రైతుబజార్లతో పాటు 500 బియ్యం మిల్లర్ల ప్రత్యేక విక్రయ కేంద్రాల ద్వారా ఈ బియ్యం అందుబాటులో ఉండనుంది. బీపీటీ సూపర్ ఫైన్ బియ్యాన్ని కిలో రూ.52కు, గ్రేడ్-1 పచ్చి బియ్యాన్ని కిలో రూ.50కు విక్రయించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. నిర్ణయించిన ధరలకే బియ్యం అందేలా అధికారులు పర్యవేక్షణ చేపట్టనున్నారు.బహిరంగ మార్కెట్లో బియ్యం ధరలపై సమగ్ర సమీక్ష నిర్వహించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఉప ముఖ్యమంత్రి కార్యాలయం వెల్లడించింది. ప్రజలకు నాణ్యమైన బియ్యం సరసమైన ధరకు అందించేందుకు బియ్యం మిల్లర్లతో చర్చలు జరిపి పరస్పర అంగీకారంతో ధరలను నిర్ణయించినట్లు పేర్కొంది. ఈ నిర్ణయంతో రాష్ట్రంలోని లక్షలాది కుటుంబాలకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూరనుందని ప్రభుత్వం భావిస్తోంది. ధరల పెరుగుదలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న సామాన్యులకు ఇది గణనీయమైన ఊరట కలిగిస్తుందని, ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమనే విషయాన్ని మరోసారి ఈ నిర్ణయం స్పష్టం చేస్తోందని అధికారులు తెలిపారు.



# నడకే..నరకం

- అత్యవసర పరిస్థితుల్లో మరిన్ని ఇబ్బందులు
- రాకపోకలకు మారుమూల గ్రామాల ప్రజల తీవ్ర అవస్థలు

ఆసిఫాబాద్,(రిపబ్లిక్ హిందుస్థాన్): జిల్లాలో పలు గ్రామాలకు వెళ్లే రోడ్లు బురదమయంగా మారడంతో ప్రజలు కాలినడక వెళ్లేందుకు సైతం తీవ్ర అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొన్నది. చినుకు పడితే చాలు రోడ్లు చిత్తడిగా మారి ప్రజలకు ప్రత్యక్ష నరకాన్ని చూపిస్తున్నాయి. జిల్లాలో మారు మూల గ్రామాలు నేటికీ కనీసం రహదారులకు నోచుకోని దుస్థితి నెలకొంది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు వర్షం వస్తే చాలు భయంగుప్పిట్లో మగ్గాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. ఇక అత్యవసర పరిస్థితుల్లో దేవుడిపై భారం వేసి నాటు వైద్యంను ఆశ్రయించాల్సిన వస్తుంది. దీంతో ఒక్కో సారి ప్రాణాలు గాలిలో కలిసి పోయిన సంఘటనలు ఉన్నాయి. గ్రామాల్లో డయేరియా, మలేరియా తదితర సీజనల్ వ్యాధులు ప్రబలినట్లయితే గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించేందుకు 104, 108 వాహనాలు సైతం వెళ్లలేని దయనీయ దుస్థితి నెలకొంది. పాలకులు ప్రతిసారి హామీ ఇచ్చినప్పటికీ ఆచరణకు నోచుకోవడం లేదు. గత నాలుగు రోజులుగా జిల్లా అంతట కురుస్తున్న భారీ వర్షాల కారణంగా రోడ్లన్నీ బురదమయం కావడంతో పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులతో పాటు వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రాలకు, జిల్లా కేంద్రానికి వచ్చే ప్రజలు అవస్థలు పడుతున్నారు.

- ఏళ్లుగా మారని దుస్థితి..

జిల్లాలో ఏళ్లుగా రోడ్ల పరిస్థితి మారడం లేదు. వందలాది గ్రామాలు వాగులు, వంకల గుండా, అడవుల గుండా ప్రయాణించాల్సిన దుస్థితి దాపురించింది. దాంతో గిరిజన గూడాలన్ని అభివృద్ధి వెలుగులకు దూరంగా విద్య, అంటువ్యాధులు వం టి తీవ్రమైన సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధాన రహదారుల నుంచి గ్రామాలకు వెళ్లే రోడ్లతో పాటు అంతర్గత రహదారుల వ్యవస్థ సరిగ్గా లేక పోవడంతో నేటికీ పల్లెలు అభివృద్ధి నోచుకోవడం లేదు. జిల్లా అధికార యంత్రాంగం నిర్వహించిన అధ్యాయనంలో మొత్తం 335 గ్రామ పంచాయతీల పరిధిలోని 449 గిరిజన గూడాలకు అసలే రోడ్డు సౌకర్యం లేనట్లుగ గుర్తించారు. ఇందులో ఆసిఫాబాద్ నియోజక వర్గానికి సంబంధించి అత్యధికంగా 305 గ్రామాలు ఉండగా సిర్పూర్ నియోజక వర్గంలో 144 గ్రామాలకు రోడ్ల నిర్మాణం జరగాల్సి ఉన్నట్లు గుర్తించారు.

- జిల్లా వ్యాప్తంగా..

జిల్లాలో 15 మండలాల పరిధిలోనూ రోడ్ల పరిస్థితి ఇప్పటికీ మారడం లేదు. చిన్న పాటి వర్షానికే రోడ్లన్ని చిత్తడిగా మారి నడవడానికి సైతం వీలు లేకుండా పోతున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు లోనవుతున్నారు. జిల్లాలో ఆసిఫాబాద్ మండలంతో పాటు వాంకిడి , కెరమెరి, రెబ్బె న, జైనూర్ , సిర్పూర్(యు) , తిర్యాణి, లింగాపూర్, కాగజ్‌నగర్ , బెజ్జూరు ,దహెగాం ,పెంచికలపేట, సిర్పూర్(టి) మండలాలలో రోడ్లు పూర్తిగా అధ్వాన్నంగా మారాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ప్రతినిత్యం రాక పోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. తప్పని సరి పరిస్థితుల్లో బురదలోనే నడుచుకుంటూ గమ్యస్థానాలకు వెళ్తున్నారు. జిల్లాలో గ్రామీణ రోడ్ల దుస్థితి దయనీయంగా దర్శనమిస్తున్నా అటు పాలకులు కానీ ఇటు అధికార యంత్రాంగం కానీ పట్టించుకున్న దాఖలాలు లేవు. ఎన్నికల సమయంలో ప్రజాప్రతినిధులు ఓట్ల కోసం గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన రోడ్డు సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చినా ఆచరణకు నోచుకోవం లేదు. దీంతో ఏటా వర్షాకాలంలో ప్రజలు నానా అవస్థలు పడాల్సి దుస్థితులు తలెత్తుతున్నాయి. గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని పలు మార్లు అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినా పట్టించుకునే నాథుడే కరువవుయ్యాడని ప్రజలు



## డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలి



,(రిపబ్లిక్ హిందుస్థాన్):ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా చేపట్టిన ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలై జేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సర్(ప్ర క్రియ, ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్‌పై సమావేశం నిర్వ హించారు. కలెక్టర్ మాట్లాడుతూ సర్‌లో సేకరించిన ఎన్యుమ రేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ నిర్ణీతగడవు కంటే ముందుగానే పూర్తిచేసే విధంగా అధికారులు, రాజకీయ ప్రతినిధులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. డబుల్, డెత్, షిఫ్ట్ అయిన వారి ఓట్లను నిబంధనల ప్రకారం తొలగిస్తామన్నారు. ఇంకా ఎన్యుమరేషన్ ఫారాలు అందించని వారిని గుర్తించి బూత్‌స్థాయి ఏజెంట్ల ద్వారా ఫారాలను అధికారులకు సమర్పించే విధంగా చర్యలు తీసుకోవా లన్నారు. ఒక కుటుంబంలోని ఓటర్లందరు ఒకేపో లింగ్ కేంద్రంలో ఓటుకలిగి ఉండేలా చర్యలు తీసుకో వాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రయ్య, రాములు, రెవెన్యూ అధికారి మోతీరాం, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రకళ, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

## మహారాష్ట్రలో వరదలో కొట్టుకుపోయిన కారు.. తల్లీకూతుళ్ల మృతి

ఇంటర్‌నెట్ డెస్క్: మహారాష్ట్రలో పెను విషాదం చోటుచేసుకుంది. వరద నీటిలో కారు కొట్టుకుపోయిన ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులు చనిపోయారు. తల్లీకూతుళ్ల ప్రాణాలు కోల్పోయారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గురువారం యవాత్మాల్ జిల్లాకు చెందిన అవినాష్ ఖందారే ఫ్యామిలీ కారులో అహిల్యానగర్‌లోని 'లోని' ప్రాంతానికి బయలుదేరింది. భారీ వర్షాల కారణంగా ధార్వా ఏరియాలో కుప్తీ నది పోటెత్తడంతో.. వరద నీరు అక్కడి ఓ బ్రిడ్జిపైకి వచ్చేసింది. కారు నడుపుతున్న అవినాష్ ఆ వరద నీటిని తక్కువ అంచనా వేశాడు. కారును బ్రిడ్జి మీదకు పోనిచ్చాడు.కారు వరద నీటిలో కొట్టుకుపోయింది. ఆ సమయంలో కారులో అవినాష్‌తో పాటు అతడి భార్య మాధవి, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. అందరూ నీటిలో కొట్టుకుపోయారు. అవినాష్ కారు నుంచి బయటపడి ఓ చెట్టును పట్టుకుని ప్రాణాలు రక్షించుకున్నాడు. మిగిలిన ముగ్గురు నీటి ప్రవాహంలో కొట్టుకుపోయారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసు, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ టీమ్స్ రంగంలోకి దిగాయి. నీటిలో కొట్టుకుపోయిన వారి కోసం రెస్క్యూ ఆపరేషన్స్ మొదలెట్టాయి. రెస్క్యూ సిబ్బంది శుక్రవారం యవాత్మాల్ జిల్లాలో తల్లీకూతుళ్ల మృతదేహాలను గుర్తించారు.



# రిజన విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

జైనూర,(రిపబ్లిక్ హిందుస్థాన్):గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శు క్రవారం కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులు సిడం రామారావు, కినక వామన్‌రావులకు ఏర్పాటు చేసిన వీడ్కోలు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.ఉపాధ్యాయులు విద్యాభివృద్ధికి అందించిన సేవలు ప్రశంసనీయమని ఎమ్మెల్యే కొనియాడారు. వారి సేవలను ఆదర్శంగా తీసుకుని ఇతర ఉపాధ్యాయులు కూడా అంకితభావంతో పనిచేసి గిరిజన విద్యాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.జైనూర్ స్కూల్ కాంప్లెక్స్‌కు ఎమ్మెల్యే తొలిసారిగా రావడంతో ప్రధానోపాధ్యాయురాలు పార్వతి, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులను కూడా శాలువాలతో సత్కరించి, వారి శేష జీవితం ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో గడవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమేత విశ్వనాథరావు, మాజీ ఎంపీటీసీ కుమ్ర భగవంతరావు, మాజీ ఎంపీపీ చెల్లె లక్ష్మణ్ యాదవ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆత్రం శంకరరావు, నాయకులు మెస్రం అంబాజీరావు, కనక గంగారం, ప్రధానోపాధ్యాయురాలు పార్వతి, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

## టబుతో మళ్లీ నాగార్జున.. 28 ఏళ్ల తర్వాత హిట్ కాంబో రిపీట్



వెబ్ డెస్క్: టాలీవుడ్ కింగ్ అక్కినేని నాగార్జున కెరీర్‌లో ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కనున్న 100వ సినిమాపై ఆసక్తికరమైన అప్‌డేట్ బయటకు వచ్చింది. తాత్కాలికంగా చఖఅఅస్త్ర100 పేరుతో రూపొందుతున్న ఈ చిత్రంలో ప్రముఖ నటి టబు కథానాయికగా నటించనున్నట్లు చిత్ర వర్గాలు వెల్లడించాయి. దాదాపు 28 ఏళ్ల తర్వాత నాగార్జున, టబు మళ్లీ పూర్తి స్థాయి జోడీగా ప్రేక్షకుల ముందుకు రానుండటం సినీ అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది.నాగార్జున, టబు కలిసి గతంలో నటించిన చిత్రాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా 1996లో దర్శకుడు కృష్ణవంశీ తెరకెక్కించిన 'నిన్నే పెళ్లాడతా' తెలుగు సినీ చరిత్రలో క్లాసిక్ ప్రేమకథగా నిలిచింది. ఆ సినిమాలో వీరిద్దరి కెమిస్ట్రీ అప్పుడే ప్రేక్షకుల హృదయాల్లో యమ క్రేజీగా నిలిచిపోయింది. అనంతరం 1998లో విడుదలైన 'ఆవిడ మా ఆవిడే' చిత్రంలో కూడా ఈ జంట కలిసి నటించింది. అలాగే నాగార్జున తనయుడు అఖిల్ చిన్నప్పటి చిత్రం 'సిసింద్రి'లో టబు అతిథి పాత్రలో కనిపించింది. ఇప్పుడు దాదాపు మూడు దశాబ్దాల తర్వాత ఈ ఇద్దరు మరోసారి ఒకే సినిమాలో కనిపించనుండటంతో అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.నాగార్జున 100వ చిత్రానికి తమిళ దర్శకుడు రా. కార్తీక్ దర్శకత్వం వహించనున్నారు. టాలీవుడ్‌లో ఎన్నో విజయవంతమైన జోడీల్లో నాగార్జున-టబు కాంబినేషన్‌కు ప్రత్యేక స్థానం ఉంది. ఇప్పుడు అదే జోడీ మరోసారి ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతుండటంతో చఖఅఅస్త్ర100పై భారీ అంచనాలు నెలకొన్నాయి.